క్లుప్తంగా

గృహ నిర్మాణాల్లో పురోగతి ఉండాల్సిందే



ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ

చిప్పగిరి: నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి ఉండాల్సిందేనని ఎంపీడీఓ కొండయ్య ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో గృహ నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. మండలంలో గృహ నిర్మాణాల స్థితిగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జనవరి 15వ తేదీలోగా నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఈ భవ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు శయనాజ్, విజయ, శాంతి, లక్ష్మి పాల్గొన్నారు.

గోపూజతో ముగింపు

ఆస్పరి: మండలంలోని పుటకలమర్రి గ్రామంలో తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి ఆధర్యంలో ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం గోపూజతో ముగించారు. ఈసందర్భంగా డాక్టర్ మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులు కలిసిమెలసి సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. గోపూజ అనంతరం ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమలో సర్పంచ్ విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

మద్దికెర: స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా ఎంఈఓ గోపా ల్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు మా ట్లాడుతూ.. క్రీడాకారులు గ్రామ స్థాయి నుంచే తమ ప్రతిభను మెరుగుపరుచుకుని జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదగాలని సూచించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసులు, ఆపద్బంధు సేవాసమితి అధ్యక్షుడు సునీల్‌కుమార్ ఎస్ఎఫ్ఐ మండల అ. ధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

పత్తికొండ రూరల్: పది పరీక్షలకు విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తీర్ణత సాధించాలని బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకమ్మ అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణ పనులు



సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

ఆలూరు: మండలంలోని నేమకల్లు గ్రామంలో చేట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఇటీవల నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రోడ్లు లేవని స్థానికులు మంత్రి జయరాం దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాలతో గ్రామంలోని ప్రధాన కూడలి నుంచి రాంపురయ్య వీధి వరకు సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇందులో భాగంగా మొదట రోడ్డుకిరు వైపులా డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టారు. శనివారం ఈఓపీఆర్డీ బాలన్న పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయ న వెంట సర్పంచ్ ప్రేమ్ కుమార్ ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి


మద్దికెర: ఈనెల 18, 19 తేదీలలో ఎమ్మిగనూరులో జరిగే రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు తెలిపారు. శనివారం మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. రైతులు, సీపీఐ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు కోదండరాముడు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఆడుదాం- ఆంధ్ర' క్రీడా పోటీలకు క్రీడాకారుల నమోదును త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ దశరథ రామయ్య అన్నారు. శనివారం నందవరం ఎంపీడీఓ కార్యాలయంలో క్రీడాకారుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈనెల 26వ తేదీ నుంచి ఆడుదాం- ఆంధ్ర క్రీడా పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఆయా గ్రామ సచివాలయ స్థాయిలో క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తారన్నారు. మొత్తం 4,500 మందిని ఆన్‌లైన్‌లో నమోదు చేశామని తెలిపారు. సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ ఈరన్న పాల్గొన్నారు.

చెన్నకేశవుని రథోత్సవం చూద్దాం..రారండి

● నేడు మొలగవల్లిలో రథోత్సవం



శ్రీ చెన్నకేశవ స్వామి మూల విరాట్



రథోత్సవానికి ముస్తాబవుతున్న ఆలయం

ఆలూరు రూరల్: కొలిచే వారికి కొంగు బంగారమైన మొలగవల్లి చెన్నకేశవ స్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ముందు ఆలయంలో అర్చకులు ప్రభు స్వామి ఆధ్వర్యంలో గణపతి పూజ, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించి సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. 18న వసంతోత్సవం (కుడుములాట) ఉంటుంది. రథోత్సవం సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు రానున్నారు. దర్శనం కోసం వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు తెలిపారు. రథోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు.

హాజరుకానున్న మంత్రి గుమ్మనూరు

మొలగవల్లి గ్రామంలో ఆదివారం జరగనున్న చెన్నకేశవ స్వామి రథోత్సవానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, సోదరులు దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, నారాయణ స్వామి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



చెన్నకేశవ స్వామి రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. రథాన్ని కూడా ఇప్పటికే ముస్తాబు చేశాం. ఆదివారం రథోత్సవం, సోమవారం కుడుములాటతో వేడుకలు ముగియనున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం.
– కిష్టప్ప, ఆలయ కమిటీ నిర్వాహకులు, మొలగవల్లి

జాతీయ స్థాయి పోటీలకు ఎమ్మిగనూరు విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులకు షూ అందజేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు టౌన్: జాతీయ స్థాయి పోటీలకు ఎమ్మిగనూరుకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. వారిని స్థానిక ప్రభుత జూనియర్ కళాశాల మైదానంలో వైఎస్సార్‌సీపీ 34వ వార్డు ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రమేష్, ప్రిన్స్ స్వచ్ఛందసేవా సంస్థ అధ్యక్షుడు వహాబ్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.ఎంఎస్ బాలికల జెడ్పీ పాఠశాల విద్యార్థిని సౌజన్య గత నెలలో వైజాగ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలలో ప్రతిభ చూపి జార్ఖండ్‌లోని రాంచీలో జరగనున్న పోటీలకు ఎంపిక కాగా, స్థానిక దీక్ష కళాశాల విద్యార్థి ఈశ్వర్ అండమాన్ నికోబార్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులు, క్రీడా పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు విజేతనాగరాజు, సర్తాజ్,శేఖర్, ఓంకార్, రఘు, గుడికల్ వంశి, పాల వీరేష్, తారక్, శివ పాల్గొన్నారు.

'రావూస్' విద్యార్థుల ప్రతిభ



అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన విద్యార్థులు

ఎమ్మిగనూరు టౌన్: రాష్ట్ర స్థాయి ఖోఖో సౌత్‌జోన్ పోటీలలో తమ విద్యార్థులు ప్రతిభ చాటి, పతకాలు సాధించారని రావూస్ డిగ్రీ కళాశాల సీఈఓ తిరుమల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ తమ విద్యార్థులు విజయ్, ఉపేంద్ర, హరన్, జయశంకర్, నందిని, రేఖ, పద్మావతి, జ్యోతి 4100 రిలేలో వరుసగా రెండవ, మూడవ స్థానాల్లో నిలిచారన్నారు. 800 మీటర్ల సింగిల్ ఈవెంట్‌లో ఉపేంద్ర రెండవ స్థానం, 100 మీటర్ల ఈవెంట్‌లో నందిని మూడవ స్థానం సాధించారన్నారు. తమిళనాడు రాష్ట్రం సెంట్రల్ యూనివర్సిటీ తిరువూరులో జరిగే ఖోఖో పోటీలకు నందిని, రేఖ, పద్మావతి ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు ఈశ్వర్

హాలహర్వి: మండలంలోని బాపురం, గూళ్యం గ్రామాలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం బాపురంలో మంత్రి గుమ్మనూరు జయరాం తనయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశ్వర్ వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరారన్నారు. పార్టీ కోసం పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. బాపురం సర్పంచ్ భాగ్యలక్ష్మి భర్త నాగేంద్ర ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన 50 కుటుంబాలు పార్టీలో చేరడం సంతోషకరమన్నారు. అనంతరం హాలహర్వికి వెళ్లి ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణను పరామర్శించారు. ఆయన ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు మహేంద్ర, గుమ్మనూరు మధు, జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప, మండల కన్వీనర్ భీమప్పచౌదరి, సచివాలయ కన్వీనర్ రంజిత్, సొసైటీ చైర్మన్ అర్దగేరి శ్రీనివాసులు, కురువ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప పాల్గొన్నారు.

వరిగడ్డి ట్రాక్టర్ ట్రాలీ బోల్తా

హొళగుంద: స్థానిక వాల్మీకి సర్కిల్ వద్ద శనివారం వరిగడ్డితో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ట్రాక్టర్‌లో ఉన్న వారు అప్రమత్తం కావడంతో ప్రాణాపాయం తప్పింది. ఎల్లార్తి రైతులు కర్ణాటకలోని దేవినగర్ నుంచి వరిగడ్డిని ట్రాక్టరులో గ్రామానికి తీసుకొస్తుండగా వాల్మీకి సర్కిల్ వద్ద ట్రాలీ అదుపు తప్పి బోల్తా పడింది.

జాతరకు ముహూర్తం ఖరారు

హొళగుంద: హొళగుంద సిద్దేశ్వరస్వామి జాతరకు ముహూర్తం ఖరారు చేసినట్లు ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ్, శివశంకర్‌గౌడ్, సిద్దార్థగౌడ్ తెలిపారు. వాస్తవంగా ఇక్కడి ప్రజలతో పాటు కర్ణాటక భక్తులు ఆయా ప్రాంతాల్లో జరిగే ఉత్సవాలకు సంబంధించి కన్నడ క్యాలెండర్లలో ముద్రించిన తేదీలను ఖరారు చేసుకుంటారన్నారు. ఈ ఏడాది వేద పండితులను సంప్రదించగా ఆ తేదీ దశమి ఉండదని.. రథోత్సవం జరపడం మంచిది కాదని భావించి కొత్త ముహూర్తం ఖరారు చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 13న కంకణధారణ, 16న నంది ఉత్సవం, 17న గజ ఉత్సవం నిర్వహించి 18న రథోత్సవం, 19న లంకాదహనం, 20న వసంతోత్సవం నిర్వహించేందుకు నిర్ణయించినట్లు వెల్లడించారు.

జయప్రదం చేయండి

హొళగుంద: ఈనెల 18, 19 తేదీలలో ఎమ్మిగనూరులో జరిగే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం(ఏపీకేఎస్) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పెద్యాట మారెప్ప కోరారు. శనివారం ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. మారెప్ప మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యాయన్నారు. రైతులకు సంబంధించి అంశాలపై మహాసభలో ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు ప్రణాళికను రూపొందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు మౌలాసాబ్, మల్లయ్య, పంపా, గురునాథ్, వాసప్ప, మంజు, బద్రి, చంద్ర, పరశురాం, గాదిలింగ, సుధాకర్, ఈరన్న పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పరిశీలన

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల కేంద్రంలోని కేజీబీవీ, హైస్కూల్, పలు స్కూళ్లలో 8వ తరగతి విద్యార్థుల ట్యాబ్‌లను శనివారం ఎంఈఓ-2 రమేశ్ పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న తల్లితండ్రుల సమావేశాల్లో పాల్గొన్నారు. పదవ తరగతి విద్యార్థులు అధిక మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా 100 రోజుల ప్రణాళిక అమలుకు ఉ పాధ్యాయులు కృషి చేస్తున్నారని, తల్లితండ్రులు తమ వంతు ప్రోత్సాహమందించాలన్నారు.

సన్మానం



రైతు దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

వెల్దుర్తి (కృష్ణగిరి): సేంద్రియ వ్యవసాయ నిపుణుడు సూదేపల్లె వైద్యం గిడ్డయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన తనయుడు వైద్యం రామానాయుడు ఆధ్వర్యంలో వెల్దుర్తి, రామళ్లకోట గ్రామాల్లో పలువురు రైతులను సన్మానించారు. సిద్ధరామయ్య పీఠాధిపతి ఎల్లప్పస్వామి, గ్రీట్ విత్ గ్రీన్ సొసైటీ అధ్యక్షుడు బలిజ శ్రీరాములు, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు హరిసింహనాయుడు చేతుల మీదుగా రైతు కుటుంబాలను సన్మానించి, పేదలకు ఆహార ప్యాకెట్లు, దుప్పట్ల పంపిణీ చేసి, ఆర్థిక సాయం అందజేశారు.

దివ్యాంగులకు పరికరాలు అందిస్తాం



దివ్యాంగుల వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

మద్దికెర: ఉమ్మడి జిల్లాలో రూ.2.69 కోట్ల విలువ చేసే మూడు చక్రాల వాహనాలు, ల్యాప్‌టాప్‌లు, శ్రవణ యంత్రాలతో పాటు వివిధ పరికరాలను 1,132 మంది దివ్యాంగులకు అందించామని ఉమ్మడి కర్నూలు జిల్లాల దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రైజ్ ఫాతిమా తెలిపారు. శనివారం మద్దికెర ఎంపీడీఓ కార్యాలయంలో అస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం పథకం కింద ప్రతిభావంతులకు, సీనియర్ సిటిజన్లకు సహాయ పరికరాలు అందించేందుకు అర్హులను గుర్తించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులకు పరీక్షలు చేసి అర్హులైన వారికి నీతి ఆయోగ్ ద్వారా జనవరిలో పరికరాలు అందిస్తామన్నారు. సదరం సర్టిఫికెట్ల జారీకి వివరాలు నమోదు చేసుకున్నామన్నారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, నీతిఆయోగ్ ఏబీఎఫ్ అఖిల పాల్గొన్నారు.

ఓటరు జాబితాను సమగ్రంగా విచారించాలి



ఓటరు జాబితాను సమీక్షిస్తున్న ఏపీసీ వేణుగోపాల్

కృష్ణగిరి: ఓటరు జాబితా సమగ్రంగా విచారించి సవరణ పక్కాగా చేపట్టాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. శనివారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజేశ్వరి, బీఎల్ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏపీసీ మాట్లాడుతూ ఒకే వ్యక్తికి రెండు, మూడు ఓట్లు ఉంటే ఓటరు అభిప్రాయం మేరకు ఒకే ప్రాంతంలో ఉంచి మిగతా చోట్ల తొలగించాలన్నారు. ఓటరు నమోదు, సవరణ దరఖాస్తులను విచారించి ఎన్నికల అధికారులకు నివేదించాలన్నారు. అనంతరం ఆయన మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని, మెయిన్ స్కూల్‌ను తనిఖీ చేశారు. దివ్యాంగులతో ముచ్చటించారు. చాక్లెట్లు పంచారు. మెయిన్ స్కూల్ రికార్డులు, హాజరు పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ మారుతి, ఎంఈఓ-2 మద్దయ్య ఉన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి



మహిళలకు పథకాల బ్రోచర్ అందజేస్తున్న సయ్యద్‌చాంద్

ఎమ్మిగనూరుటౌన్:సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మరోసారి ముఖ్యమంత్రి కావాలని స్థానిక టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ సయ్యద్ చాంద్ అన్నారు. శనివారం 21వ వార్డులో హెచ్‌బీఎస్ కాలనీలో వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల బ్రోచర్లు అందజేశారు. గత పాలనకు, ప్రస్తుత పాలనకు తేడాను వివరించి మరోసారి జగనన్నే ఎన్నుకుందామని కోరారు. కార్యక్రమంలో గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే ఆలయాల అభివృద్ధి



భూమి పూజలో పాల్గొన్న గుమ్మనూరు సోదరులు

దేవనకొండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ఆలయాల అభివృద్ధి జరుగుతోందని పార్టీ నియోజకవర్గ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, మాళమల్లేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు అన్నారు. మండలంలోని కప్పట్రాళ్లలో వెలసిన కొలుట్ల చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణ అభివృద్ధి పనులకు రూ.1.20 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వచ్చాక శిథిలావస్థలో ఉన్న ఆలయాలకు పూర్వ వైభవం తీసుకొచ్చిందన్నారు. ఆలయ భూముల పరిరక్షణ, అర్చకులకు గౌరవ వేతనం, భక్తులకు వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుందన్నారు. ఆలయాల్లో మన సంస్కృతి దాగి ఉందని.. వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కన్వీనర్ తెర్నెకల్ సురేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, పార్టీ నాయకులు మల్లికార్జున, నారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రేమనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు స్నేహ బంధాలను పెంచుతాయి

ఆలూరు రూరల్: క్రీడలు స్నేహ బంధాలను పెంచుతాయని దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. మొలగల్లిలో చెన్నకేశవస్వామి రథోత్సవం సందర్భంగా నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చిన్న ఈరన్న సమక్షంలో ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.51 వేలు, రెండో బహుమతి రూ.25 వేలు, మూడో బహుమతి రూ.10,116, నాలుగో బహుమతి రూ.5,116 అందించనున్నారు. వైస్ ఎంపీపీ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పేదల ముంగిటకే మెరుగైన వైద్యం



వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

● ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: గ్రామాల్లోనే మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించి సిబ్బందిని నియమించారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం మండల పరిధిలోని బురుజుల గ్రామంలో రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వైద్యం కోసం పేదలు ఇబ్బందులు పడే వారన్నారు. ఇప్పుడలా కాదని నిరంతర వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని చెప్పారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సుబ్బయ్య, వైస్ ఎంపీపీ జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయభరత్‌రెడ్డి, అనిమిరెడ్డి, నరసింహారెడ్డి, ఎంపీడీఓ నరసింహమూర్తి, వైద్యులు రాగిణి, ఈఓపీఆర్డీ మద్దిలేటిస్వామి, ఏఈ వెంకటేశ్వర్లు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ భద్రయ్య పాల్గొన్నారు.

హోసూరు-మొలగవల్లి రోడ్డు పరిశీలన

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరు-మొలగవల్లి రోడ్డును శనివారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి పరిశీలించారు. ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేర్చేందుకు సుమారు రూ.7.20 కోట్ల వ్యయంతో రహదారి పనులు చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను రూ.2కోట్ల వ్యయంతో పూర్తి చేసి ప్రజలకు రోడ్డు మార్గం సుగమం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఆమె వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎన్నికల ప్రశాంతతకు చర్యలు

● పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



ఆస్పరి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

ఆస్పరి: రానున్న ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఆస్పరి పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గ్రామాల పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో ప్రతి గ్రామానికి ఒక పోలీస్‌ను నియమించామని, అక్కడి పరిస్థితులు తెలుసుకుని ఎప్పటికప్పుడు తమకు సమాచారం ఇచ్చేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గొడవలు, ఘర్షణలకు పాల్పడే వారిని ముందుగానే గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో కర్ణాటక నుంచి వచ్చే లిక్కర్, సారాను అరికట్టేందుకు నిఘా ఉంచామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని పార్టీల నేతలు సహకరించాలని కోరారు. ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వరప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా అభివృద్ధి పనులు



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీఆర్ డీఈఈ

నందవరం: అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు వేగవంతంగా సాగుతున్నాయని పంచాయతీ రాజ్ డీఈఈ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని సోమలగూడూరు గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. అలాగే పొనకలదిన్నెలో పూర్తయిన సీసీ రోడ్డును తనిఖీ చేశారు. పొనకలదిన్నె గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.20 లక్షలతో పనులు పూర్తి చేశామన్నారు. సోమలగూడూరులో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. నిర్లక్ష్యం వహించొద్దని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పావని, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, పీఆర్ ఏఈ జయన్న పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు పరిధి దాటి వైద్యం చేస్తే చర్యలు



మాట్లాడుతున్న డాక్టర్ బాలకృష్ణారెడ్డి

ఆస్పరి: మండలంలోని గ్రామాల్లో పనిచేసే ఆర్ఎంపీలు పరిధి దాటి వైద్యం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డాక్టర్ బాలకృష్ణారెడ్డి హెచ్చరించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్ఎంపీలకు వైద్యంపై అవగా హన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు స్కానింగ్ చేయడం కానీ, ప్రవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేయడం కానీ చేయకూడదన్నారు. బాలింతలకు, 5 ఏళ్లలోపు పిల్లలకు యాంటిబయాటిక్స్, స్టెయిరాయిడ్స్ ఎక్కువగా ఇవ్వకూడదన్నారు. ఆర్ఎంపీలు చిన్న చిన్న జబ్బులకు మాత్రమే ప్రాథమిక చికిత్స చేయాలన్నారు. ఎవరైనా పరిధి దాటి వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడమే గాకుండా ప్రాక్టీసును రద్దు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రాణెమ్మ, ఏంఈఓ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

20న సీహెచ్‌సీ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు



అధికారులు, వైద్యులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తిలో రూ.5.77 కోట్లతో నిర్మించిన సామాజిక ప్రభుత్వ ఆస్పత్రి (సీహెచ్‌సీ) భవనం సహా పలు రోడ్లను ఈనెల 20న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. వెల్దుర్తి నుంచి రామళ్లకోటకు రూ.10 కోట్లతో నిర్మించిన 10 కి.మీల మేర రోడ్డు, వెల్దుర్తి వంకపై రూ.2 కోట్ల అదనపు నిధులతో పూర్తి చేసిన బ్రిడ్జ్ వెడల్పు రోడ్డు, పట్టణంలోని అంతర్గత రోడ్ల ప్రారంభోత్సవానికి తీసుకోవాల్సిన ఏర్పాట్లపై శనివారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ బాలచంద్రారెడ్డి, డాక్టర్లు, అధికారులతో సమీక్షించారు. ఆస్పత్రి ఆవరణలో అంతర్గత రహదారుల ఏర్పాటుకు సైతం చర్యలు తీసుకుంటామని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, ఎంపీడీఓ శ్రీనివాసరావ్, సీఐ సురేశ్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.